# విప్లవ మేధావి

సాయుధవిప్లవం ద్వారా తప్ప దేశానికి విముక్తిలేదని అందరు మార్క్సిస్టులూ నమ్మినట్టే గణాచారి కూడా నమ్మాడు. సిద్ధాంత సాహిత్యమంతా కంఠస్థం చేశాడు.

అయితే దురదృష్టవశాత్తూ గణాచారికి రెండు ఇబ్బందులు ఎదురయాయి. ఒకటి, అట్టడుగు వర్గాలలో రాజకీయ చైతన్యం - విప్లవ చైతన్యం దాకా పోకుండానే... అంతగా లేదని గణాచారి అనుయాయులు భావించారు. గణాచారికి తుపాకీపట్టి బూర్జువా పెట్టుబడిదారీ తెనాతీలనందరినీ కాల్చిపారెయ్యాలని ఉన్నా, తనకు ఆ శక్తి లేదని అతనికి తెలుసు.

అందుచేత ఏం చెయ్యాలి? ప్రజలలో విప్లవ బీజాలు నాటి, విప్లవోత్సాహం రేకెత్తించే సారస్వతం సృష్టించాలి. ఆ సారస్వతం అక్కడక్కడా ఉన్న విప్లవకారులకు ఎంతో సహాయంగా ఉంటుంది.

సారస్వత కార్యక్రమం సాగింది. అందులో గణాచారి విశిష్ట పాత్రవహించాడు. తన రచనలు తాను మళ్లీ మళ్లీ చదువుతుంటే విప్లవావశ్యకత ప్రజలకు అరటిపండు ఒలిచినట్టుగా స్పష్టమయింది. దానినిండా లెనిన్ కొటేషన్లూ, మార్క్స్ కొటేషన్లూ, మావో కొటేషన్లూ కొల్లలుగా ఉన్నాయి. దేశీయుల కొటేషన్లు అంతగా లేవు.

గణాచారికి రోజురోజుకూ ఆవేశం హెచ్చుతున్నది. ఒకవంక విప్లవం దేశం నాలుగు చెరగులా అంటుకున్నది. విప్లవ రనచలతో ఇంక పనిలేదు. అతను ఓ మంచి రోజు చూసి, నినాదాలిచ్చుకుంటూ విప్లవ స్థావరానికి బయలుదేరాడు. దురదృష్టశాత్తూ అంతకుముందే పోలీసులు ఆ స్థావరంలో ఉన్న చంటి పిల్లల దగ్గిర నుంచీ అందర్నీ పోలీసువాన్‌లో కుక్కి, అడవిలోకి తీసుకుపోయి ఇంక వెళ్లండని చెప్పి, వెనక నుంచి అందర్నీ కాల్చేశారు. ఎందుకంటే, ఎమర్జెన్సీయా, మాటలా?

గణాచారి ఆశ్చర్యపోయి, తనవెనక వస్తున్న లక్షలాది జనం కోసం చూశాడు. ఒక్క పురుగులేదు. కామ్రేడ్‌లు అరణ్యంలో దాక్కోబోయారేమోనని ఇంకా ముందుకు సాగాడు. ఎందురుగా వస్తూ పోలీసువాన్ కనిపించింది.

*ముద్రణ : యువ, మార్చ్ 1978*